సాక్షి సిద్దిపేట

బుధవారం । 5 । మార్చి । 2025



అగ్గి రాజుకుంటే బుగ్గేనా...

జిల్లా వ్యాప్తంగా అగ్నిమాపక కేంద్రాలు అరకొర వసతులతో కొట్టుమిట్టాడుతున్నాయి.


వివరాలు 8లో ▸



చి'వరి'కి ఇలా..

నీరందక పంటలు ఎండుతున్నాయి. చేసేదిలేక ఎండిన పొలాల్లో పశువులను వదిలి మేపుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

వివరాలు 9లో ▸



ఆకట్టుకున్న రోబోటిక్స్ ప్రదర్శన



రోబోటిక్స్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో మంగళవారం జిల్లా స్థాయి రోబోటిక్స్ ప్రదర్శన నిర్వహించారు. 14 ప్రభుత్వ, రెండు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు రూపొందించిన రోబోటిక్స్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తిని పెంపొందిస్తాయని అన్నారు. సోహం అకాడమీ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ప్రదర్శనలకు కృషికల్ప ఎన్‌జీటీసీ ఈఓ పాటిల్ నగదు బహుమతిని అందించారు. పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహక కార్యదర్శి డాక్టర్ సీహెచ్ మధుసూదన్, కన్వీనర్ బి. కృష్ణయ్య, వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి, సీఓఈ గోపాలసుదర్శనం, జిల్లా విద్యాశాఖ ఏఓ రామస్వామి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పుష్ప సోయగం.. దారి పసుపు మయం



ములుగు వద్ద రోడ్డుకు ఇరువైపులా పూల సోయగాలు

చెట్లకు పూసిన పసుపు పూలు

పసుపు పూల సోయగాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తున్నాయి. ములుగు వద్ద హరితహారంలో భాగంగా రాజీవ్ రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలకు పూసిన పూలు కనువిందు చేస్తున్నాయి. సూర్యోదయం, సూర్యాస్తమయం సమయాల్లో అందం మరింత రెట్టింపవుతోంది. ఆకురాలే కాలం కావడంతో పువ్వులే ఎక్కువగా కన్పిస్తున్నాయి. ఈ దృశ్యాన్ని సాక్షి క్లిక్ మనిపించింది. – సాక్షి, సిద్దిపేట

న్యూస్‌రీల్

రైల్వేలైన్ పనులు అడ్డుకున్న రైతులు



రైల్వేలైన్ పనులు అడ్డుకుని నిరసన తెలుపుతున్న రైతులు

చిన్నకోడూరు(సిద్దిపేట): నష్ట పరిహారం చెల్లించాకే రైల్వేలైన్ పనులు చేపట్టాలని గంగాపూర్ రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పనులు అడ్డుకున్నారు. తమ పట్టా భూములు రైల్వేలైన్ నిర్మాణ పనుల్లో కోల్పోయామని, ఇప్పటి వరకు నష్ట పరిహారం చెల్లించలేదన్నారు. నష్టపరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ హరికిరణ్, ఎస్ఐ బాలకృష్ణలు అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. సమస్యను కలెక్టర్‌కు వివరించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

టీఎన్జీఓల సంఘం జిల్లా కార్యదర్శి విక్రమ్‌రెడ్డి



మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న టీఎన్‌జీఓ సంఘం నేతలు

గజ్వేల్: ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీఎన్జీఓ పనిచేస్తున్నదని సంఘం జిల్లా కార్యదర్శి విక్రమ్‌రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్‌లోని టీఎన్‌జీఓ భవన్ ఆవరణలో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదించి, పెడింగ్‌లో ఉన్న బిల్లులను ఇప్పించేందుకు కృషిచేస్తామని తెలిపారు. టీఎన్‌జీఓల సంఘం గజ్వేల్ యూనిట్ అధ్యక్షుడు లింగం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నిమ్మ సురేందర్, ఫోరం అధ్యక్షులు నగేష్, నాయకులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయండి

కార్మికశాఖ ఉప కమిషనర్‌కు వినతి



కార్మిక శాఖ ఉప కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

గజ్వేల్‌రూరల్: కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో పాటు కనీస వేతనం రూ.26వేలుగా అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య కోరారు. ఈ సందర్భంగా మంగళవారం గజ్వేల్‌కు వచ్చిన కార్మికశాఖ ఉప కమిషనర్ రవీందర్‌రెడ్డికి సీఐటీయూ గజ్వేల్ ఇండస్ట్రియల్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎల్లయ్య మాట్లాడుతూ కనీస వేతన జీఓల కాలం ముగిసి 15ఏళ్లు గడుస్తున్నా ఇంకా కొనసాగించడం సరికాదన్నారు. వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బండ్ల స్వామి, రాములు, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి రయ్‌రయ్!

ఇటు ఎలివేటెడ్ కారిడార్.. అటు మెగా హెచ్‌ఎండీఏ

- గజ్వేల్‌కు కొత్త శోభ
- హెచ్‌ఎండీఏ పరిధిలోకి మరిన్ని కొత్త మండలాలు
- కారిడార్‌తో ప్రయాణం మరింత సులువు
- ప్రగతిలో మరో ముందడుగు



శామీర్‌పేట ఎలివేటెడ్ కారిడార్ నమూనా ఇదే

శామీర్‌పేట ఎలివేటెడ్ కారిడార్, మెగా హెచ్‌ఎండీఏ పరిధి పెంపు అంశాలు గజ్వేల్ ప్రాంతానికి కొత్త కళను తీసుకురాబోతున్నాయి. ఇప్పటికే ఇక్కడ ట్రిపుల్‌ఆర్ నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్న వేళ తాజాగా ఈ రెండు అంశాలతో మరింత కలిసి రానున్నది. ఎలివేటెడ్ కారిడార్‌తో ఈ ప్రాంతం నుంచి హైదరాబాద్ నగరానికి ప్రయాణం సులువుగా మారుతుండగా, మెగా హెచ్‌ఎండీఏ పరిధి పెంపుతో గజ్వేల్‌తోపాటు నియోజకవర్గంలోని కొత్తగా మరిన్ని మండలాలు చేరే అవకాశం కనిపిస్తున్నది. ఈ పరిణామం అభివృద్ధితో మరో ముందడుగుగా మారనున్నది.

గజ్వేల్: నగరానికి సమీపంలో ఉన్న గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధిలో శరవేగంగా ముందుకెళ్తోంది. హెచ్‌ఎండీఏ (హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పరిధితో పరిశీలిస్తే ఒక రకంగా గజ్వేల్ నియోజకవర్గంలోని మండలాలు నగరంతో అతి సమీపంగా మారాయి. ఇప్పటికే నియోజకవర్గంలోని ములుగు, వర్గల్, తూప్రాన్, మనోహరాబాద్, మర్కూక్ మండలంలోని కొంత భాగం హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్నాయి. దీని పరిధి పెంపు ప్రతిపాదన తెరపైకి వస్తుండగా.. గజ్వేల్, మర్కూక్ మండలం పూర్తిస్థాయిలో, అదేవిధంగా జగదేవ్‌పూర్‌తోపాటు సమీప నియోజకవర్గం దుబ్బాకలోని రాయపోల్ మండలాలు కొత్తగా చేరే అవకాశముందనే ప్రచారం జరుగుతోంది.

ఎలివేటెడ్ కారిడార్‌తో..

మేడ్చల్ జిల్లా శామీర్‌పేట నుంచి రామగుండం వరకు 206 కిలోమీటర్ల మేర రాజీవ్‌రహదారి విస్తరించి ఉంది. ఈ రహదారి ఉత్తర తెలంగాణ జిల్లాలకు ప్రధాన మార్గం. ప్రత్యేకించి గజ్వేల్ నియోజకవర్గానికి కీలకమైన రోడ్డు. గజ్వేల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వారికి శామీర్‌పేట వరకు వెళ్లడం ఒక ఎత్తయితే.. అక్కడి నుంచి ట్రాఫిక్‌లో నగరంలోకి వెళ్లడం గగనంగా మారుతోంది. దీనివల్ల ప్రయాణం నరకప్రాయమవుతోంది. ఇలాంటి తరుణంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సన్నాహాలు జరుగుతుండటం గజ్వేల్ ప్రాంతానికి కలిసి రానున్నది. ప్రస్తుతం ఇక్కడినుంచి ప్రయాణానికి సుమారు గంటన్నర సమయం తీసుకుంటుండగా ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే కేవలం 45 నిమిషాల్లోనే సికింద్రాబాద్‌కు చేరుకునే అవకాశముంది. ప్రస్తుత ఎలివేటెడ్ కారిడార్ సికింద్రాబాద్‌లోని జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి శామీర్‌పేట వరకు సుమారుగా 18కిలోమీటర్లకుపైగా నిర్మాణం జరగనున్నది. ట్రాఫిక్ చిక్కుల్లేకుండా ఈ కారిడార్ నిర్మాణానికి కసరత్తు జరుగుతోంది. అత్యాధునిక ప్రమాణాలతో ఈ కారిడార్ రూపుదిద్దుకోనున్నది. ఇది అందుబాటులోకి వస్తే ఇప్పటివరకు పడ్డ ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పడనున్నది.

ట్రిపుల్‌ఆర్ పనులు ప్రారంభమవుతున్న వేళ..

ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం పనుల ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్న సంగతి తెల్సిందే. ఉత్తర భాగం నిడివి 161.518 కిలోమీటర్లు. ఈ రోడ్డు చౌటుప్పల్, యాదాద్రి-భువనగిరి, గజ్వేల్, తూప్రాన్, నర్సాపూర్‌ల మీదుగా సంగారెడ్డి వరకు విస్తరించనున్నది. ఇందులో గజ్వేల్ ప్రాంతంలోనే అత్యధికంగా 31.71కిలోమీటర్లు ఉన్నది. ఇలాంటి తరుణంలోనే ఈ ప్రాంతానికి మెగా హెచ్‌ఎండీఏ పరిధి పెంపు ప్రతిపాదన, ఎలివేటెడ్ కారిడార్ పనులు మరింత కలిసి రానున్నది. అభివృద్ధిలో మరో ముందడుగు పడనున్నది. ప్రత్యేకించి చతికిల పడిన రియల్ ఎస్టేట్‌కు ఈ అంశాలు కలిసి రానున్నాయి.

ఇంటర్ పరీక్షలకు వేళాయె..

- నేటి నుంచి షురూ..
- సర్వం సిద్ధం
- జిల్లాలో 43 పరీక్షా కేంద్రాలు
- 20,595 మంది విద్యార్థులు



పరీక్షా కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్షలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. బుధవారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు విద్యాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా జనరల్, ఒకేషన్, ప్రథమ, ద్వితీయ సంవత్సరం మొత్తం కలిపి 20,595 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకోసం జిల్లాలో 43 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలీస్, రెవెన్యూ, ఆర్‌టీసీ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.

సీఎస్, డీఓల నియామకం

ప్రతి 24 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్, ప్రతీ పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూరింటెండెంట్ (సీఎస్), డిపార్ట్‌మెంటల్ అధికారుల(డీఓ)ను, 14 మంది అదనపు చీఫ్ సూపరింటెండెంట్(ఏసీఎస్)లను నియమించారు. మాస్‌కాపీయింగ్ జరగకుండా ఉండేందుకు పరీక్షల కన్వీనర్‌తో పాటు హైపవర్ కమిటీ, ఇద్దరు జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు, రెండు ఫ్లైయింగ్, మూడు సిట్టింగ్ స్క్వాడ్స్ బృందాలను ఏర్పాటు చేశారు. పరీక్షాకేంద్రాల వద్ద పోలీస్ అధికారులు 144 సెక్షన్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు గాని ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకునేందుకు జిల్లా కమాండ్ కంట్రోల్ నంబర్ 9949330191 నంబర్‌లో సంప్రదించాలని అధికారులు సూచించారు.

గంట ముందే చేరుకోవాలి



ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించాం. వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికాలకు పరీక్షా హాల్‌లోకి అనుమతి లేదు. ప్రశాంతమైన వాతావరణంలో ఒత్తిడికి గురికాకుండా విద్యార్థులు పరీక్షలు రాయాలి.

–రవీందర్‌రెడ్డి, జిల్లా ఇంటర్ విద్యాధికారి

ఉచిత ఆటో ఏర్పాటు

- ఎమ్మెల్యే పల్లా వెల్లడి

సాక్షి ఎఫెక్ట్

కొమురవెల్లి(సిద్దిపేట): ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత ఆటో సౌకర్యం కల్పిస్తున్నట్లు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. 'సాక్షి'లో ప్రచురితమైన 'ఇంటర్ పరీక్ష.. దూరమే పెద్ద శిక్ష' అనే కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. చేర్యాల, ముస్త్యాలలో ఉన్న పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు వెళ్లేందుకు బుధవారం నుంచి తన సొంత ఖర్చుతో ఉచితంగా ఆటో ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు 'సాక్షి'కి తెలిపారు. దీంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బండారు దత్తాత్రేయను జిలేబితో తులాభారం వేస్తున్న నాయకులు

కొండపోచమ్మ సన్నిధిలో దత్తాత్రేయ



గర్భగుడిలో అమ్మవారికి పూజలు

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ మంగళవారం కుటుంబ సమేతంగా కొండపోచమ్మను దర్శించుకున్నారు. అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బీజేపీ నేతలు జిలేబితో దత్తాత్రేయను తులాభారం వేశారు. – జగదేవ్‌పూర్(గజ్వేల్)

హరీశ్‌రావు చిత్ర పటానికి క్షీరాభిషేకం



రంగాయపల్లి వద్ద హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రంగనాయక సాగర్ నుంచి రంగాయపల్లికి గోదావరి జలాలు రావడంతో గ్రామస్తులు మంగళవారం కాలువల వద్ద ఎమ్మెల్యే హరీశ్‌రావు చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ హరీష్‌రావు కృషి ఫలితంగానే గ్రామానికి సాగు నీరు వచ్చిందన్నారు. ఎన్నో ఏళ్లగా గ్రామానికి సాగు నీరు లేక భూములు బీడుగా మారాయన్నారు. రంగనాయక సాగర్ నుంచి హరీష్‌రావు సొంత నిధులతో కాలువలు తవ్వించి గోదావరి జలాలు రప్పించి బీడు భూములు సస్యశ్యామలంగా మార్చారన్నారు.

మల్లన్న ఏడోవారం ఆదాయం రూ.59.20లక్షలు

కొమురవెల్లి(సిద్దిపేట): బ్రహ్మోత్సవాలలో భాగంగా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి ఏడో ఆదివారం రూ. 59,20,661 వచ్చినట్లు ఈఓ రామాంజనేయులు తెలిపారు. శని, ఆది, సోమవారాలలో భక్తులు వివిధ రకాల మొక్కులు, దర్శనాలు, లడ్డూ ప్రసాదాలు, పట్నాలు, బోనాలు, టికెట్ల అమ్మకాల ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు. గత ఏడాది కంటే రూ.23,07,294 అధికంగా ఆదాయం సమకూరినట్లు తెలిపారు. లెక్కింపులో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వరికి సస్యరక్షణ చర్యలు చేపట్టండి

- కాండంతొలిచే పురుగు, అగ్గి తెగులు అధికం
- జిల్లా వ్యవసాయ అధికారి రాధిక



మర్రిముచ్చాలలో వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి రాధిక

కొమురవెల్లి(సిద్దిపేట): వరిలో కాండం తొలిచే పురుగు, అగ్గి తెగులు అధికంగా ఉందని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి రాధిక తెలిపారు. మంగళవారం మండలంలోని మర్రిముచ్చాల గ్రామంలో వరి పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్గి తెగులు సోకిన వరి ఆకులపై కండె ఆకారంలో ఎర్రటి మచ్చ ఏర్పడి క్రమంగా ముదురు గోధుమరంగులోకి మారుతుందని, ఆకులు ఎండిపోతాయని అన్నారు. నివారణకు రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి ట్రైసైక్లోజోన్ అనే మందును 0.6గ్రా. లేదా కసుగామైసిన్ మందును1.5మీ.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కాండం తొలిచే పురుగు నివారణకు పొట్టదశలో ఎకరానికి కార్టఫ్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పీమందుని పిచికారీ చేయాలని రైతుకుల సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మ, ఏఈఓ రమ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కోడ్ తర్వాత కొత్త రేషన్ కార్డులు

- నేతలందరూ సమన్వయంతో పని చేయాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్
- నేడు క్యాంప్ కార్యాలయంలో జాబ్ మేళా



వినతులు స్వీకరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: ఎన్నికల కోడ్ ముగియగానే అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు అందించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ప్రత్యేక గ్రీవెన్స్‌లో మంత్రి వినతులు స్వీకరించారు. చదువుకున్న యువకులు ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి బుధవారం క్యాంప్ కార్యాలయంలో మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. యంగ్ ఇండియా రెసిడెన్సియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గౌరవెల్లి, గండిపెల్లి ప్రాజెక్టు కాలువల భూ సేకరణ వేగంగా జరుగుతోందని, త్వరలోనే ప్రాజెక్టుల ద్వారా సాగు నీరు అందిస్తామన్నారు. నియోజకవర్గంలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. గ్రామాల్లో నేతలందరూ సమన్వయం చేసుకొని పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జరుగుతోందని, ఇల్లు లేని వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు.

మంత్రికి సమస్యల వినతి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని పలు సమస్యలను పరిష్కరించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి అజ్జు యాదవ్ మంగళవారం మంత్రి పొన్నం ప్రనభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. మంత్రి స్పందించి సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. పార్టీ బలోపేతంపై యువత ముందుకు రావాలని సూచించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

నిందితుడి రిమాండ్

నర్సాపూర్: పోలీసులపై చేయి చేసుకున్న ఘటనలో నిందితుడు సురేశ్‌ను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు స్థానిక ఎస్‌ఐ లింగం తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా తమ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు మోహన్, భిక్షపతి సోమవారం మండలంలోని మూసాపేట గ్రామానికి వెళ్లగా గ్రామానికి చెందిన సురేశ్ కానిస్టేబుళ్లను బూతులు తిట్టి చేయి చేసుకున్నాడని పేర్కొన్నారు. కానిస్టేబుళ్ల ఫిర్యాదు మేరకు నిందితుడు సురేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

నిర్వాహకురాలితోపాటు విటుడు, మహిళ అదుపులోకి

సిద్దిపేటఅర్బన్: వ్యభిచార గృహంపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి విటుడు, మహిళతోపాటు నిర్వాహకురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో బాలరాజు యశోధ అనే మహిళ తన ఇంటిలో కొంత కాలంగా వ్యభిచార దందా నిర్వహిస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేయగా పాలమాకుల గ్రామానికి చెందిన విటుడు మోతే శేఖర్‌తోపాటు మరో మహిళను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,700 నగదు, మూడు సెల్‌ఫోన్స్, బైక్ స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక డంప్ సీజ్

కొండపాక(గజ్వేల్): అక్రమంగా ఇసుకను డంప్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంకిరెడ్డిపల్లి గ్రామ శివారులో రేగులపల్లి పద్మారెడ్డి వ్యవసాయ బావి కొంత కాలంగా దండుగుల కనకయ్య రహస్య ప్రదేశంలో అక్రమంగా ఇసుకను డంప్ చేసుకుంటూ ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు, త్రీ టౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోదాలు చేసి 30 టన్నుల ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటరెడ్డి కథనం మేరకు.. కుత్బుల్లాపూర్‌కు చెందిన వేణు(38) హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీస్‌లో రుణ రికవరీ ఏజెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం సంగారెడ్డి నుంచి హైదరాబాద్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఇస్నాపూర్ సాంఘీక సంక్షేమ గురుకుల వసతి గృహం సమీపంలో జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్ ఢీకొట్టాడు. అనంతరం అటు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక చక్రానికి తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే పటాన్ చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ సుల్తాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

జిన్నారం (పటాన్‌చెరు): మహిళ హత్య కేసులో గుమ్మడిదల పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం కేసుకు సంబంధించిన వివరాలను గుమ్మడిదల పోలీసులు వెల్లడించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం బిక్య తండాకు చెందిన గుగులోత్ పూర్య (52) కౌడిపల్లి మండలం కన్నారం తండా కేతావత్ ముని అనే మహిళను డిసెంబర్ 12న గుమ్మడిదల కల్లు కాంపౌండ్ వద్ద మాయమాటలు చెప్పి నల్లవల్లి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. అనంతరం మహిళను అత్యాచారం చేయడమే కాకుండా చున్నీతో మెడకు ఉరి వేసి దారుణంగా హత్య చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా ఈనెల 4న సీసీ కెమెరాల సహాయంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు జిన్నారం సీఐ నయీముద్దీన్ తెలిపారు. హత్య కేసును ఛేదించిన ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి హెడ్ కానిస్టేబుల్ వెంకటేశం, సికిందర్, కిశోర్, కానిస్టేబుల్ సాయి వర్ధన్ రెడ్డిలను, జిన్నారం సీఐ నయీముద్దీన్ ప్రత్యేకంగా అభినందించారు.

అగ్గి రాజుకుంటే బుగ్గేనా..!

సమస్యల నడుమ అగ్నిమాపక కేంద్రాలు

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- శిథిలావస్థలో భవనాలు
- నీటి వసతి అంతంతే
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆందోళనకర పరిస్థితులు
- ప్రారంభమైన వేసవి కాలం
- ప్రమాదాలు జరిగితే నివారించడం కష్టమే



సాక్షి విజిల్

వేసవి నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. అయితే సిబ్బంది వెళ్లి మంటలార్పి ప్రమాద స్థాయిని తగ్గించాల్సి ఉంటుంది. ఇందుకుగాను సరైన సిబ్బంది, నీటి వసతి అవసరం. కానీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఫైర్‌స్టేషన్‌లో సరైన వసతులు లేక ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. సిబ్బంది పూర్తి స్థాయిలో లేక ఖాళీలు దర్శనమిస్తున్నాయి. పై స్థాయి అధికారి నుంచి కింది స్థాయి వరకు సిబ్బంది లేరు. అలాగే అగ్రిమాపక కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల ఉన్న భవనాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. అరకొర వసతుల నడుమే సిబ్బంది విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి వసతి అంతంత మాత్రంగానే ఉంది. అధికారులు చర్యలు చేపట్టి అగ్నిమాపక కేంద్రాల్లో సరైన వసతులు కల్పిస్తేనే ప్రమాదాలు నివారించవచ్చు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అగ్నిమాపక కేంద్రాల్లో ఉన్న వసతులు, పరిస్థితులపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



తాత్కాలిక భవనంలో కొనసాగుతున్న అగ్నిమాపక కేంద్రం

శిథిల భవనంలో అగ్నిమాపక కేంద్రం

నారాయణఖేడ్: శిథిల భవనంలో సరైన సదుపాయాలు లేక ఖేడ్ అగ్ని మాపక కేంద్రం నిర్వహణ ఇబ్బంది కరంగా మారింది. ఖేడ్‌లో 2004లో అగ్ని మాపక కేంద్రం మంజూరైంది. అప్పటి నుంచి ఇప్పటివరకు శిథిలంగా ఉన్న పంచాయతీరాజ్ గోడౌన్ భవనంలోనే కార్యాలయం కొనసాగుతుంది. భవనం పెచ్చులూడుతూ కూలేందుకు సిద్ధంగా ఉంది. నీటి వసతి కోసం బోరు లేకపోవడంతో 5 కిలోమీటర్ల దూరంలోని కమలాపూర్ చెరువులోంచి నీటిని నింపుకొని ప్రమాదాల నివారణకు వెళ్తున్నారు. ఏడు మండలాలైన ఖేడ్, కంగ్టి, సిర్గాపూర్, కల్హేర్, నిజాంపేట, నాగల్‌గిద్ద, మనూరు ఈ అగ్ని మాపక కేంద్రం పరిధి కిందకు వస్తాయి. నూతన భవనం నిర్మాణానికి రూ.1.20 కోట్లు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో భవన నిర్మాణం, బోరు, ట్యాంకు నిర్మాణం చేపట్టనున్నారు. అప్పటివరకు ఇబ్బందులు తప్పేలా లేవు.



పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం

సమృద్ధిగా నీరు

మెదక్‌జోన్: మెదక్ జిల్లా కేంద్రంలో మూడు అగ్ని మాపక శకటాలు ఉండగా. వాటిలో ఒకటి పాడైపోయింది. దానికి మరమ్మతులు చేయాల్సి ఉంది. ప్రస్తుతం రెండు శకటాలను ఉపయోగిస్తున్నారు. అలాగే జిల్లా అధికారితో పాటు 16 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 14 మంది ఉన్నారు. ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. అగ్నిమాపకశాఖ ఆవరణలోనే బోరు ఉంది. నీటి నిల్వకోసం కుండీలను నిర్మించగా నీరు సమృద్ధిగా ఉంది.

ఫైర్ స్టేషన్‌లో నర్సా'పూర్'

నర్సాపూర్: నర్సాపూర్‌లోని అగ్నిమాపక కేంద్రంలో సమస్యలు తిష్ట వేశాయి. రెండు ఫైరింజన్లు ఉండగా ఒకే షెడ్డు ఉండటంతో ఒక దానిని బయటే పెడుతున్నారు. ఫైర్ స్టేషన్‌కు ఆఫీసు భవనంతో పాటు ఇక్కడ పని చేసే సిబ్బందికి రెస్ట్ రూమ్ ఇతర వసతులకు శాశ్వత భవనం లేనందున ఫైరింజన్ షెడ్డు పక్కన ఉన్న చిన్న పాటి ఇరుకైన గదినే ఉద్యోగులు విశ్రాంతి తీసుకోవడానికి వినియోగిస్తున్నారు.ఫైర్ స్టేషన్‌లో పని చేసే కొందరు ఉద్యోగులు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో వారి పోస్టులతోపాటు ఒక లీడింగ్ ఫైర్ మెన్, డ్రైవర్ పోస్టు ఖాళీగా ఉంది. పది మంది ఫైర్‌మెన్లు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉండగా 9 ఖాళీలున్నాయి. ఫైర్‌మెన్ల ఖాళీలు భర్తీ చేయలేని ఉన్నతాధికారులు వారి స్థానంలో 10 మంది హోంగార్డులతో విధులు చేయిస్తూ ఫైర్ స్టేషన్‌ను కొనసాగిస్తున్నారు.



షెడ్డులో స్థలం లేక ఎండలో ఉన్న ఫైరింజన్

అరకొరగా సిబ్బంది

గజ్వేల్: గజ్వేల్‌లోని అగ్నిమాపక కేంద్రం సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతోంది. నియోజకవర్గంలోని గజ్వేల్, ములుగు, వర్గల్, జగదేవ్‌పూర్, కొండపాక, కుకునూర్‌పల్లి మండలాల్లోని ప్రజల అవసరాల కోసం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ 34 మంది సిబ్బంది పనిచేయాల్సి ఉండగా, కేవలం 12 మంది మాత్రమే ఉన్నారు. అత్యంత కీలకమైన ఈ కేంద్రానికి సొంత భవనం ఏళ్ల తరబడి కలగానే మిగిలింది. ప్రస్తుతం తూప్రాన్ రోడ్డు వైపున గల ప్రాంతీయ జీవనోపాదుల వనరుల శిక్షణ కేంద్రంలో తాత్కాలికంగా కొనసాగుతుంది. మూడు యంత్రాలు అందుబాటులో ఉన్నా.. సింగిల్ ఫేజ్ బోరు మాత్రమే ఉంది. దీని వల్ల సకాలంలోని నీటిని నింపుకొని వెళ్లడం ఇబ్బందిగా మారుతోంది. వెంటనే ఇక్కడ త్రీఫేజ్ మోటార్ బోరు బిగించాల్సి ఉంది. అంతేకాకుండా సిబ్బంది కొరత తీర్చి, సొంత భవనం ఏర్పాటు చేస్తేనే వేగవంతమైన సేవలు అందే అవకాశముంది.

సంసిద్ధమే.. బొల్లారంలో సమస్యాత్మకం

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో బీహెచ్‌ఈఎల్, బీడీఎల్ పాశ మైలారం, పటాన్‌చెరులో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. పాశమైలారం పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి ఎప్పటికప్పుడూ శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతుంటాయి. పారిశ్రామిక వేత్తలు సహకారంతో అక్కడ అగ్నిమాపక శకట నిర్వహణ కొనసాగుతుంది. బీహెచ్‌ఈఎల్‌లో రెండు, పటాన్‌చెరులో రెండు, పాశమైలారంలో ఒకటి అగ్నిమాపక శకటాలు ఉన్నాయి. అందుకు సరిపడా సిబ్బంది ఉన్నారు. అయితే కొన్ని సందర్భాల్లో ఎద్దుమైలారం నుంచి అగ్నిమాపక శకటాలను రప్పిస్తారు.

బొల్లారంలో ఇబ్బందికర పరిస్థితి

జిన్నారం, గుమ్మడిదల, బొల్లారంలో అగ్నిమాపక కేంద్రాలు లేవు. పెరిగిన జనాభా, కాలనీలకు అందుబాటులో అగ్నిమాపక కేంద్రాలు కావాలి. బొల్లారంలో అగ్నిమాపక కేంద్రం కావాలని చాలా కాలంగా కోరుతున్నారు. ప్రైవేటు సంస్థల సహకారంతో ప్రమాదాలను నియంత్రిస్తున్నారు. బొల్లారంలో పారిశ్రామిక వాడలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడల్లా హెట్రో పరిశ్రమ, లేదా రెడ్డి ల్యాబ్స్ అగ్నిమాపక సిబ్బందితో ప్రమాదాలను అదుపులోకి తీసుకొస్తున్నారు.



పటాన్‌చెరులో అగ్నిమాపక కేంద్రం

మార్కెట్ యార్డులో ఫైర్‌స్టేషన్

దుబ్బాక: దుబ్బాకలో అగ్నిమాపక కేంద్రంకు సొంత భవనం లేకపోవడంతో వ్యవసాయ మార్కెట్ యార్డులోనే ఎనిమిదేళ్లుగా కొనసాగుతుంది. మార్కెట్‌యార్డ్‌లోని రేకుల షెడ్ నుంచే ఫైర్‌స్టేషన్ నిర్వహణ చేస్తున్నారు. ఫైర్‌స్టేషన్ భవనం నిర్మాణం కోసం చీకోడ్ రోడ్‌లో స్థలం సిద్ధంగా ఉన్నప్పటికీ నిధులు మంజూరు చేయకపోవడంతో అరకొర సౌకర్యాలతోనే ఫైర్‌స్టేషన్ కొనసాగుతుంది. మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరిగినన్ని రోజులు ఫైర్ సిబ్బందికి చాలా ఇబ్బందిగా తయారైంది. ఫైర్ స్టేషన్‌లో అధునాతన టెక్నాలజీతో కూడిన 4,500 లీటర్ల సామర్థ్యంతో కూడిన ఫైరింజన్ వాహనం ఉంది. ఫైరింగ్ స్టేషన్ ఆఫీసర్‌తో పాటు మొత్తం 16 మంది సిబ్బంది ఉన్నారు. కేవలం ఒక ఫైర్‌మెన్ పోస్టు ఖాళీగా ఉంది. ఫైరింజన్‌లోకి వాటర్‌ను లచ్చపేట రోడ్‌లో బోర్ వద్ద నింపుకోవాల్సి వస్తుంది. కొత్తగా సొంతభవనం నిర్మిస్తే ఇబ్బందులు తీరుతాయి.



దుబ్బాక మార్కెట్ యార్డులో ఉన్న ఫైరింజన్

అన్ని విధాలుగా సిద్ధం



వేసవి కాలంలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి దీని కోసం ముందుగానే అన్ని విధాలుగా జాగ్రత్త చర్యలతో సిద్ధంగా ఉన్నాం. సొంత భవనం లేక ఇబ్బంది తప్ప సిబ్బందితో పాటు అధునాతనమైన ఫైరింజన్ సౌకర్యంతోపాటు అన్ని బాగానే ఉన్నాయి.

– కమలాకర్, దుబ్బాక అగ్నిమాపక అధికారి

పరిధి ఎక్కువ.. ఫైర్ ఇంజన్లు తక్కువ

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ కేంద్రం పరిధిలో జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం, రాయికోడ్, కోహీర్ మండలాలు ఉన్నాయి. జహీరాబాద్ డివిజన్ పరిధి పెద్దగా ఉండడంతో తరుచుగా ఏదో ఒక చోట ప్రమాదాలు సంభవించి ఆస్తి నష్టం జరుగుతుంది. ముఖ్యంగా చెరుకు తోటల్లో అగ్నిప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల జహీరాబాద్ మొగుడంపల్లి, న్యాల్‌కల్ మండలాల్లో అగ్నిప్రమాదాలు సంభవించి పదుల ఎకరాల్లో పంట దగ్ధమైంది. అగ్ని మాపక కేంద్రంలో ఫైర్ ఇంజన్ మాత్రం ఒక్కటే ఉంది. పాత ఇంజన్ పాడైపోవడంతో కొత్త అగ్నిమాపక యంత్రం వచ్చింది. అ లాగే సిబ్బంది కొరత వేధిస్తుంది. పది మంది ఫైర్‌మెన్‌లు ఉండాలి కానీ ప్రస్తుతం నలుగురే ఉన్నారు. మూడు డ్రైవర్ పోస్టులు ఉండగా ఒక పోస్టు ఖాళీగా ఉంది. ర్ ఆఫీసర్ పోస్టుకు ఖాళీగానే ఉంది. అగ్నిమాపక కేంద్రంలోనిసేఫ్టీ పరికరాలు పాతబడడంతో వాటి స్థానంలో కొత్తవి వచ్చాయి.



జహీరాబాద్ అగ్నిమాపక కేంద్రంలో ఫైర్ ఇంజన్

వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువ

- సిద్దిపేట ఇన్‌చార్జి ఫైర్ అధికారి నర్సింలు



సిద్దిపేటకమాన్: వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని సిద్దిపేట ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి అధికారి నర్సింలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే సమాచారం అందించాలని ఫైర్ సిబ్బంది అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు. సిద్దిపేట ఫైర్ స్టేషన్‌లో ఒక మల్టీపర్పస్ టెండర్ వెహికిల్ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ వాహనంలో 4,500 లీటర్ల నీటి సామర్థ్యం, 500 లీటర్ల ఫోమ్ ఉంటుందని తెలిపారు. సిద్దిపేట ఫైర్ స్టేషన్‌లో ఒక అధికారి, ఒక హెడ్ కానిస్టేబుల్, ఆరుగురు కానిస్టేబుళ్లు, ముగ్గురు డ్రైవర్లతో కలిపి మొత్తం 11 మంది సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ ఏడాది 26 అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు.



సిద్దిపేట ఫైర్ స్టేషన్‌లో వాహనాలు

మిషన్ భగీరథ నీళ్లే దిక్కు

జోగిపేట(అందోల్): అందోలు నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణంలోని ఫైర్ స్టేషన్‌లో ఇద్దరు డ్రైవర్లు, ముగ్గురు ఫైర్ మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న ఒక్క డ్రైవర్ ఎస్‌ఐ ట్రైనింగ్‌కు వెళ్లాడు. ప్రస్తుతం నారాయణఖేడ్‌కు చెందిన డ్రైవర్ డిప్యూటేషన్‌పై పని చేస్తున్నాడు. చాలా కాలంగా ఫైర్ ఇంజన్ పనిచేయని పరిస్థితికి రావడంతో ఇటీవల జహీరాబాద్‌లోని ఫైర్ ఇంజన్‌ను జోగిపేట స్టేషన్‌కు పంపారు. ఇప్పటి వరకు వాహనంను అధికారికంగా అప్పగించలేదన్నది సమాచారం. స్టేషన్‌కు అవసరమైన నీటి కోసం వేసిన బోరు నీటిలో డ్రైనేజీ నీరు కలిసి కలుషితం కావడంతో దుర్గంధం వస్తుంది. వాటిని వినియోగించకుండా మున్సిపల్ అధికారులతో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ తీసుకున్నట్లు ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.



జోగిపేట ఫైర్ స్టేషన్

కేంద్రం మంజూరు.. స్థలం కరువు

తూప్రాన్: తూప్రాన్ డివిజన్ కేంద్రానికి అగ్నిమాపక కేంద్రాన్ని రెండేళ్ల కిందట ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ అధికారులు స్థలం కేటాయింపు చేయకపోవడంతో కేంద్రం ఏర్పాటు కావడం లేదు. తూప్రాన్ ఉమ్మడి మండలంలో పారిశ్రామిక వాడలు అధికంగా ఉన్నాయి. ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే సకాలంలో అగ్నిమాపక కేంద్రాలు అందుబాటులో లేని కారణంగా రూ.కోట్లలో ఆస్తి నష్టం జరుగుతోంది. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు గజ్వేల్, రామాయంపేట, నర్సాపూర్ అగ్నిమాపక కేంద్రాల నుంచి వాహనాలు రావాల్సిన దుస్థితి నెలకొంది. గంటలకు పైగా జాప్యం జరగడంతో అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అగ్నిమాపక కేంద్రాన్నికి స్థలం కేటాయింపు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రైవర్ల కొరత

రామాయంపేట(మెదక్): రామాయంపేట ఫైర్ స్టేషన్ (అవుట్ పోస్టు)లో సిబ్బంది కొరత నెలకొంది. మొత్తం 16 మంది సిబ్బందికి ముగ్గురిని డిప్యూటేషన్‌పై మెదక్ పంపించారు. ఇక్కడ కేవలం 13 మంది మాత్రమే పని చేస్తున్నారు. వీరిలో ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులు, 11 మంది హోంగార్డులున్నారు. ఫైర్ ఇంజన్ తోలడానికిగాను ఇద్దరు ప్రత్యేకంగా డ్రైవర్లను నియమించాల్సి ఉండగా, హోంగార్డులే బండి తోలుతున్నారు. వర్షాకాలంలో షెడ్డు ఉరుస్తుండటంతో సిబ్బంది ఇబ్బందులపాలవుతున్నారు.



రామాయంపేట ఫైర్ స్టేషన్

అనారోగ్య సమస్యలతో ఉరేసుకొని ఆత్మహత్య

కొండపాక(గజ్వేల్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ కథనం మేరకు.. కొండపాక మండలంలోని దుద్దెడ మధిర శెలపు గ్రామానికి చెందిన రమేశ్(38) పంబ్లర్ పనులు చేస్తుంటాడు. ఇతడు కడుపునొప్పితోపాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆరు నెలలుగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్య కవిత పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లి సిద్దిపేటలో ఉంటుంది. రమేశ్ సోమవారం పని నిమిత్తం సిద్దిపేటలో వెళ్లి రాత్రి ఇంటికి చేరుకొని తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. అనారోగ్య సమస్యలతో పాటు భార్య కాపురానికి రావడంలేదన్న మనస్తాపంతో అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. తల్లి చూసి సిద్దిపేటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడి తల్లి భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గడ్డి మందు తాగి వృద్ధుడు

దుబ్బాకటౌన్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేటలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజు కథనం మేరకు.. ధర్మాజీపేటకు చెందిన ఐరేని యాదగిరి గౌడ్ (67) గ్రామంలో వ్యవసాయం చేస్తూ భార్య, కుమారులతో జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా యాదగిరి గౌడ్ అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది సోమవారం ఇంట్లో గడ్డి మందు తాగి వాంతులు చేసుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వాసపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం వృతి చెందాడు. మృతుడి భార్య భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అన్నను చంపిన తమ్ముడు

చేగుంట(తూప్రాన్): సొంత తమ్ముడే అన్నను చంపిన ఘటన మాసాయిపేటలో మంగళవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. మండల కేంద్రమైన మాసాయిపేటకు చెందిన దుంపల మహేశ్(34), చందూ ఇద్దరు అన్నాదమ్ముళ్లు. పెళ్లి జరిగినా వారి భార్యలు గొడవపడి పుట్టింటికి వెళ్లిపోగా అన్నాదమ్ముళ్లు ఒకే ఇంట్లో ఉంటున్నారు. సోమవారం సాయంత్రం కూరగాయల కోసం వెళ్లిన చందూ మద్యం సేవించి ఆలస్యంగా ఇంటికి రాగా అన్న తిడుతూ గొడవ పడ్డాడు. దీంతో చందూ అన్న మహేశ్‌ను గొంతు నులిమి చంపేసాడు. అనంతరం ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడని గ్రామస్తులను నమ్మించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని చందూను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

రైతులకు సమస్యలుంటే..

న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలి: న్యాయమూర్తి స్వాతిరెడ్డి



సిద్దిపేటకమాన్: రైతులకు ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి తెలిపారు. సిద్దిపేట కోర్టు భవనంలో వ్యవసాయ రుణాలపై జిల్లా బ్యాంకు మేనేజర్లు, వ్యవసాయశాఖ అధికారులు, రైతు రక్షణ సమితి సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దీర్ఘకాలిక రుణాలు ఏన్పీఏగా మారిన రైతులకు డెట్ స్వాపింగ్ పద్ధతిలో బ్యాంకు అధికారులు తిరిగి రుణ సౌకర్యం కల్పించాలన్నారు. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ జిల్లాలోని బ్యాంకు అధికారులు ఆసక్తి చూపడం లేదన్నారు. బ్యాంకు అధికారులు రైతులకు డెబిట్ స్వైపింగ్ లోన్స్ కోసం హైకోర్టు ఆదేశాలను పాటిస్తూ వారి రుణాలను మాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, న్యాయ సేవా సిబ్బంది పాల్గొన్నారు.

దొంగతనం కేసులో జైలు, జరిమానా

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం మీనాజీపేటలో దొంగతనానికి పాల్పడిన నిందితుడికి మంగళవారం గజ్వేల్ కోర్టు న్యాయమూర్తి ప్రియాంక జైలు శిక్షతోపాటు జరిమానా విధించారు. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. తూప్రాన్ డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన సిరిగిరి నర్సింహులు(45) రెండు నెలల కిందట మీనాజీపేటలో ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డాడు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్ చేయగా, కేసు విచారణ అనంతరం న్యాయమూర్తి నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో తొమ్మిది మంది

కోహెడ(హుస్నాబాద్): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కోర్టు జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ అభిలాష్ తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా వాహనాల తనిఖీ చేపట్టగా శనిగరం గ్రామానికి చెందిన బోనాల సురేశ్(28), రామచంద్రాపూర్‌కు చెందిన గట్టు బాబు(35), చెంచల్ చెర్వుపల్లికి చెందిన చేప్యాల సంపత్(38) మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. 3న హుస్నాబాద్ కోర్టులో ముగ్గురు నిందితులను హాజరుపర్చగా అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కృష్ణ తేజ ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మరో తొమ్మిది మందికి జరిమానా విధించినట్లు తెలిపారు.

చేర్యాల(సిద్దిపేట): మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 26 మందికి చేర్యాల కోర్టు ఇన్‌చార్జి జడ్జి కృష్ణతేజ్ రూ.1,000 చొప్పున జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడపడం నేరమని, అలాంటి వారిపై కఠిన శిక్షలు ఉంటాయన్నారు.

12 రోజుల జైలు శిక్ష

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 10 మందికి రూ.9 వేలు జరిమానా విధించినట్లు సీఐ విద్యాసాగర్ మంగళవారం తెలిపారు. అలాగే దుబ్బాక మండలం ఆకారం గ్రామానికి చెందిన ఒల్లెపు రాజుకు 12 రోజుల జైలు శిక్ష విధిస్తూ సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు తీర్పునిచ్చినట్లు పేర్కొన్నారు.

నాటు సారా పట్టివేత

మద్దూరు(హుస్నాబాద్): నాటు సారాను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన మద్దూరు మండలంలోని వంగపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎక్సైజ్ అధికారుల కథనం మేరకు.. దూల్మిట్ట మండలంలోని రెడ్యానాయక్ తండాకు చెందిన ఇస్లావత్ రవి బైక్‌పై నాటు సారా తరలిస్తున్నాడని సమాచారం అందింది. ఈ మేరకు తనిఖీ చేయగా అతడి వద్ద 8 లీటర్ల నాటు సారా లభ్యమైంది. దీంతో అతడిపై కేసు నమోదు చేశామన్నారు.